గుట్టపై పెండింగ్ పనులు పరిశీలన

కొండకింద నిత్యాన్నదాన సత్రాన్ని పరిశీలిస్తున్న ఈఓ వెంకట్రావ్

యాదగిరిగుట్ట, మే 3 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పెండింగ్‌తో పాటు ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పనులను ఈఓ వెంకట్రావ్ శనివారం పరిశీలించారు. ఆలయ డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మతో కలిసి పాతగుట్ట ఆలయం, టెంపుల్ సిటీపై గల వేద పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కొండ కింద నిర్మాణం దశలో ఉన్న నిత్యాన్నదాన సత్రం భవనాన్ని పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట విద్యుత్ ఈఈ ఊడెపు రామారావు, సివిల్ ఈఈ దయాకర్‌రెడ్డి ఉన్నారు.

యాదగిరిగుట్ట : మల్లాపురంలో కళాకారులకు డప్పులు అందిస్తున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

డప్పు కళాకారులకు ప్రోత్సహించాలి

- బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

యాదగిరిగుట్ట, మే 3 : డప్పు కళాకారులను ప్రోత్సహించాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య అన్నారు. మండలంలోని మల్లాపురం గ్రామంలో డప్పు కళాకారులకు సొంత నిధులతో శనివారం డప్పులు అందించి మాట్లాడారు. గ్రామాల్లో డప్పులకు బదులుగా డీజే రావడంతో వారు ఉపాధి కోల్పోతున్నారన్నారు. రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, కళాకారులను ఆదుకునే విధంగా పథకాలను తీసుకు రావాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు. కార్యక్రమంలో నార్మల్ మాజీ డైరక్టర్ ఒగ్గు భిక్షపతి, నాయకులు కారింగుల కిష్టయ్య, చల్లూరి స్వామి, కర్రె చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, మోటె రమేశ్, పుచ్చుల నర్సింహులు, చల్లూరి రామస్వామి, శేఖర్, మధు, గోపి వంశీ డప్పు కళాకారులు పాల్గొన్నారు..

రెవెన్యూ సదస్సుకు పైలట్ ప్రాజెక్టుగా ఆత్మకూరు(ఎం)

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆత్మకూరు(ఎం) : సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆత్మకూరు(ఎం), మే 3 : ప్రభుత్వం చేపట్టిన భూభారతి చట్టం అమలు కోసం జిల్లాలో మొట్టమొదటిగా రెవెన్యూ సదస్సుల కోసం ఆత్మకూరు(ఎం) మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఈనెల 5నుంచి 15వరకు గ్రామాల్లో సదస్సులను నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. స్థానిక తాసీల్దార్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలన్నారు. కోర్టు కేసు లేకుండా, వివాదాల్లేని భూ సమస్యలను నేరుగా సదస్సుల్లోనే పరిష్కారం చేయనున్నట్లు చెప్పారు. సర్వే నంబర్లతో పాటు భూముల ఎక్కువ, తక్కువ ఉన్నవారి సమస్యలపై విచారణ చేపట్టి న్యాయం చేస్తామన్నారు. 2014 జూన్ 2కు ముందు భూములు కొనుగోలు చేసిన చిన్న, సన్నకారు రైతులకు సంబంధించిన సాదా బైనామా కేసులు కూడా పరిష్కారం కానున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ ఉచితంగా రెవెన్యూ సదస్సులకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను అందజేయనున్నామని చెప్పారు. దరఖాస్తు ఫారాలపై భూ సమస్యలను రాసుకొని సదస్సులకు హాజరు కావాలని సూచించారు. సదస్సుల్లోనే భూములకు సంబంధించిన రికార్డులను కంప్యూటర్‌లో నమోదు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈనెల 5న సర్వేపల్లి, రాయిపల్లి, 6న రాఘవాపురం, రహీంఖాన్‌పేట, 7న పల్లెర్ల, సింగారం, 8న లింగరాజ్‌పల్లి,కాల్వపల్లి, 9న కూరెళ్ల, కప్రాయపల్లి, 12న తుక్కాపురం, పారుపల్లి, 13న మొరిపిరాల, పల్లెపహడ్, 14న ధర్మాపురం, కొరటికల్, 15న ఆత్మకూరు(ఎం) గ్రామాల్లో సదస్సులు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, తాసీల్దార్ లావణ్య, డీటీ షఫీయుద్దీన్, ఆర్ఐ మల్లికార్జున్‌రావు ఉన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

- వ్యవసాయ సంచాలకురాలు శాంతి నిర్మల

యాదగిరిగుట్ట, మే 3 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం ప్రతి రైతు తమ పేర్లను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని యాదగిరిగుట్ట డివిజన్ వ్యవసాయ సంచాలకురాలు శాంతి నిర్మల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో ప్రతి రైతుకు 11 అంకెల సంఖ్యను కేటాయించనున్నట్లు చెప్పారు. ఈ నమోదుపై వ్యవసాయాధికారులకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈనెల 5వ తేదీ నుంచి రైతు వేదికలతో పాటు, అనుకూలమైన ప్రాంతాల్లో రిజిస్ట్రీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. పట్టాదార్ పాస్ పుస్తకాల వివరాలను ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేసి ఫార్మర్ ఐడీ కేటాయించనున్నట్లు తెలిపారు. రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలు నేరుగా రైతులకు చేరాలనే ఆలోచనతో ప్రత్యేకంగా కార్డులను అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన మంత్రి కిసాన్ యోజన కింద లబ్ధి పొందాలంటే ఫార్మర్ ఐడీ తప్పనిసరి అని చెప్పారు. భవిష్యత్‌లో ప్రభుత్వం అందించే పథకాలకు కూడా ఈ కార్డును ప్రామాణికంగా తీసుకునే వీలుందన్నారు. రైతు విశిష్ట సంఖ్యను(ఫార్మర్ ఐడీ) పొందేందుకు ఆధార్, పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్ లింక్ ఫోన్ నంబర్ అవసరమని చెప్పారు. నమోదు చేసిన వెంటనే రైతు సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుందని, అది చెప్పగానే 11 అంకెల ప్రత్యేక గుర్తింపు నంబర్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

టూరిజం పార్కులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మిస్ వరల్డ్ స్టేట్ ఇన్‌చార్జి లక్ష్మి, అధికారులు

అందాల భామల సందర్శనకు భారీ ఏర్పాట్లు

- మిస్ వరల్డ్ పోటీల రాష్ట్ర ఇన్‌చార్జి లక్ష్మి

భూదాన్‌పోచంపల్లి, మే 3 : ఈనెల 15న పోచంపల్లిలో మిస్ వరల్డ్ పోటీలకు హాజరయ్యే విదేశీ అందాల భామల సందర్శన నేపథ్యంలో చేనేత థీమ్ ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు మిస్ వరల్డ్ పోటీల స్టేట్ ఇన్‌చార్జి, వీవర్ హౌసింగ్ కార్పొరేషన్ అధికారి లక్ష్మి అన్నారు. పట్టణ కేంద్రంలోని టూరిజం పార్కును శనివారం ఆమె సందర్శించారు. పార్కులో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో సమావేశమయ్యారు. తెలంగాణలోని ప్రసిద్ధి చెందిన వారసత్వ ప్రదేశాలు, పర్యాటక కేంద్రాలు, దేవాలయాలను విదేశీయులు సందర్శించే విధంగా అధికారులు రూట్ మ్యాప్ తయారు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా ఈనెల 15న 25 మంది విదేశీ అందాల భామలు భూదాన్‌పోచంపల్లిని సందర్శించనున్నారని, సాయంత్రం 6 నుంచి 8:30 గంటల వరకు వారు ఇక్కడ ఉంటారని తెలిపారు. టూరిజం పార్క్‌లో స్వాగత తోరణాలు, తిలకం, కోలాట ప్రదర్శన, మ్యూజియం, దారం నుంచి వస్త్రం తయారీ ప్రక్రియ వరకు విధానాలు, పోచంపల్లి ఇక్కత్, సిద్దిపేట గొల్లభామ, నారాయణపేట, గద్వాల వస్త్రాలతో అలంకరించనున్నట్లు పేర్కొన్నారు. టూరిజం ప్రాంగణంలో చేనేత వస్త్రాల తయారీ విధానాలు లైవ్ డెమో స్టేషన్‌తో పాటు వస్త్రాల ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వారసత్వ చేనేత కళను స్థానిక మహిళలతో అందాల భామలకు వివరించనున్నామని చెప్పారు. టూరిజంలో మెహందీ, లైవ్ మ్యూజిక్ కార్యక్రమాలు ఉంటాయని, ఇందులోకి 12 మందిని ఒకసారి, 13 మందిని ఇంకోసారి పంపనున్నట్లు తెలిపారు. హంపీ థియేటర్ వద్ద చేనేత కార్మికులతో ముఖాముఖి నిర్వహిస్తున్నామన్నారు. సుందరీమణుల రాక కోసం పగడ్బందీ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టూరిజం కోఆర్డినేటర్ ఉపేందర్, జిల్లా చేనేత జోలి శాఖ ఏడీ శ్రీనివాస్, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, డిప్యూటీ తాసీల్దార్ నాగేశ్వర్‌రావు, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, ఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బీబీనగర్ : నాగరాజు కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న జాగృతి జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సుజిత్‌రావు

భూదాన్‌పోచంపల్లి : ఇంద్రియాలలో ఆశిశ్ కుటుంబానికి ఆర్థికసాయం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఆలేరు టౌన్ : మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్య గౌడ్ ఆధ్వర్యంలో బియ్యం అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బీఆర్‌ఎస్, జాగృతి ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

బీబీనగర్, మే 3 : మండలంలోని రాయరావుపేటకు చెందిన జట్టోజు నాగరాజు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఆదేశాల మేరకు మృతుడి కుటుంబ సభ్యులకు జాగృతి జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సుజీత్ రావు ఆధ్వర్యంలో శనివారం రూ.50వేలు ఆర్థిక సాయం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాగృతి ఆధ్వర్యంలో అన్నివర్గాల ప్రజలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మృతుడి భార్య జట్టోజీ లతశ్రీ, వీఏఎల సంఘం అధ్యక్షురాలు మారిపెల్లి మాధవి, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎల్.రూప్‌సింగ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పట్టూరి తిరుపతి, జాగృతి జిల్లా నాయకురాలు శ్యామల, మండలం నాయకులు కవిత, వీఏఎలు ప్రమీల, ఆకుల నరేశ్, మండువ వినయ్ తదితరులున్నారు.

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన గరిసె ఆశిశ్‌కు ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగి దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఇంద్రియాల గ్రామ బీఆర్‌ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తల సహకారంతో వైద్య ఖర్చుల నిమిత్తం శనివారం బాధిత కుటుంబానికి రూ.45 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండి కృష్ణగౌడ్, మాజీ ఎంపీటీసీ మొగిలిపాక యాదగిరి, ఎదునోజు రాజ నారాయణ, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పెద్దిరెడ్డి యాదగిరి, నాయకులు ఎర్ర వెంకటేశ్, ధీరావత్ వెంకటేశ్ నాయక్, గరిసె జంగయ్య, సుర్వి బాలరాజు, చెవ్వగోని బాలకిషన్, మహేందర్‌నాయక్ పాల్గొన్నారు.

భువనగిరి కలెక్టరేట్ : ఆంజనేయులు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్

భువనగిరికలెక్టరేట్ : మండలంలోని తాజ్‌పూర్ గ్రామానికి చెందిన గెండెగల్ల ఆంజనేయులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్ శనివారం ఆంజనేయులు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందించి మాట్లాడారు.

బియ్యం వితరణ

ఆలేరు టౌన్ : పట్టణంలోని ద్వారకా నగర్ కాలనీకి చెందిన మార్గం లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బీఆర్‌ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బూడిద భిక్షమయ్యగౌడ్ అందించిన 50కేజీల బియ్యం బస్తాను బాధిత కుటుంబానికి అందించి పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణాధ్యక్షుడు పుట్ట మల్లేశంగౌడ్ మాట్లాడుతూ పట్టణంలో ప్రతి నిరుపేద కుటుంబానికి భిక్షమయ్య గౌడ్ అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ వస్పరి శంకరయ్య, బీఆర్‌ఎస్ నాయకులు పంతం కృష్ణ, జింకల రామకృష్ణ, సీసా సత్తయ్య, బీజని మధుకుమార్, కూతటి అంజన్‌కుమార్, ఎండీ ఫయాజ్, చిట్టిమెళ్ల వెంకటేశ్, గట్టు శ్రీనివాస్, రుద్రవేణి, మహేశ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వివరాల సేకరణ

బొమ్మలరామారం,మే 3 : మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వివరాలను ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్ శనివారం సేకరించారు. లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితులతో పాటు ఇతర కుటుంబ వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు 4 విడుతల్లో ప్రభుత్వం రూ.5లక్షలు అందజేస్తుందని చెప్పారు. రెండు నెలల్లో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు.

లిఫ్ట్‌లో పడి వ్యక్తి మృతి

రామ్మూర్తి (ఫైల్)

చౌటుప్పల్, మే 2 : పట్టణంలోని సందరయ్య కాలనీలో శుక్రవారం రాత్రి లిఫ్ట్‌లో జారి పడి వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన సిరిగిరి రామ్మూర్తి(39) భార్యాపిల్లలు వేసవి సెలవులు కావడంతో ఆంధ్రప్రదేశ్‌లోని తల్లి గారింటికి వెళ్లారు. రామ్మూర్తిని అదే కాలనీలో నివాసముంటున్న అతడి స్నేహితుడు అమరనేని రమేశ్ శుక్రవారం రాత్రి భోజనానికి ఇంటికి పిలిచాడు. నాలుగో అంతస్థులో నివాసముంటున్న రమేశ్ ఇంట్లో భోజనం చేసిన తరువాత రాత్రి 10 గంటల సమయంలో తిరిగి ఇంటికి వెళ్లేందుకు రామ్మూర్తి లిఫ్ట్ బటన్ నొక్కాడు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న లిఫ్ట్ పైకి వచ్చిందనుకొని గ్రిల్ గేటును బలవంతంగా తెరిచి కాలు పెట్టడంతో జారి మొదటి ఫ్లోర్‌లో ఉన్న లిఫ్ట్ మీద పడిపోయాడు. పెద్ద శబ్దం రావడంతో రమేశ్ బయటికి వచ్చి చూడగా రామ్మూర్తి లిఫ్ట్ మీద పడిపోయి ఉన్నాడు. వెంటనే స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ప్రశాంతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

'భీమిరెడ్డి స్తూపావిష్కరణ సభను జయప్రదం చేయాలి'

తుంగతుర్తి, మే 3 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా తుంగతుర్తి మండల కేంద్రంలో ఈ నెల 9న జరిగే స్తూపావిష్కరణ సభను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వరికప్పుల వెంకన్న కోరారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భీమిరెడ్డి చిన్న వయస్సులోనే ఎర్రజెండా చేతబట్టి పేదల కోసం పోరాడినట్లు చెప్పారు. రెండుసార్లు ఎమ్మెల్యే, మూడుసార్లు ఎంపీగా గెలిచి శ్రీరామ్ సాగర్ రెండో దశ కాల్వను సాధించారని, రామన్నపేట నుంచి నడికుడి వరకు రైలు మార్గాన్ని సాధించిన నేత భీమిరెడ్డి అని కొనియాడారు. సమావేశంలో తుంగతుర్తి డివిజన్ కార్యదర్శి నలుగురి రమేశ్, అర్వపల్లి మండల కార్యదర్శి వేముల పెద్ద నర్సయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి'

నూతనకల్, మే 3 : రైతు బీమాకు అర్హులైన రైతులు ఈ నెల 10వ తేదీ వరకు రైతు వేదిక కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మురళీ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీమా దరఖాస్తు కోసం పట్టా పాస్ బుక్ జీరాక్స్, ఆధార్ కార్డు జీరాక్స్, నామిని ఆధార్ జీరాక్స్ ఇవ్వాలని ఆయన సూచించారు.

రామన్నపేట : ఎంపీఓకు సమ్మె నోటీసును అందిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి : సీఐటీయూ

యాదగిరిగుట్ట, మే 3 : నరేంద్రమోడీ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా, లేబర్ కోడ్ రద్దు కోరుతూ జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం పిలుపునిచ్చారు. పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి కొబ్బరికాయల హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో కొబ్బరికాయల యజమానులకు శనివారం సమ్మె నోటీసు ఇచ్చి మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మోడీ నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తుందని విమర్శించారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీ, ట్రాన్స్‌పోర్టు రంగం కార్మికులకు ఇప్పటి వరకు కనీసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయలేదని మండి పడ్డారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు, కార్మిక హక్కులను కాపాడేందుకు జాతీయ కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు కలిసి మే 20న దేశవ్యాప్త సమ్మెను పిలుపునిచ్చాయని చెప్పారు. జిల్లాలో సంఘటిత, అసంఘటిత, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులందరూ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చుక్కల కృష్ణ, బండ శ్రీశైలం, నాయకులు చుక్కల పెద్ద వెంకటయ్య, నగేశ్, మల్లేశ్, అనిల్, రమేశ్ పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

రామన్నపేట : కార్మికుల హక్కులను కాలరాస్తున్న నాలుగు లెబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఈనెల 20 నుంచి దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బొడ్డుపల్లి వెంకటేశం అన్నారు. గ్రామ పంచాయతీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపీఓ రవూఫ్ అలీకు శనివారం ఈ మేరకు నోటీస్ అందించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు బందెల భిక్షం, మండల కార్యదర్శి నకిరేకంటి రాము, మండలాధ్యక్షుడు గాదె ఎల్లయ్య, బొడ్డు సాలయ్య, నర్సింహ, కంకల హరీశ్, జింకలింగయ్య, రాములు పాల్గొన్నారు.

శాంతి భద్రతలు కాపాడేందుకే కార్డన్ సెర్చ్ : డీసీపీ

కార్డన్ సెర్చ్ అనంతరం సూచనలు చేస్తున్న డీసీపీ అక్షాంశ్ యాదవ్

భువనగిరి అర్బన్, మే 3 : పట్టణంలో శాంతిభద్రతలు కాపాడేందుకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు డీసీపీ అక్షాంశ్ యాదవ్ అన్నారు. పట్టణంలోని హనుమాన్ వాడ, సంజీవ నగర్ కాలనీల్లో శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సుమారు 188 మంది పోలీస్ సిబ్బంది సెర్చ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ఎవరికీ తెలియని వ్యక్తులకు ఆశ్రయం కల్పించరాదని కోరారు. అనుమానాస్పదంగా, నంబర్ ప్లేట్ లేని, సరైన పత్రాలు లేని 28 బైకులు, 1 త్రీ వీలర్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 2 లిక్కర్ బెల్ట్ షాపులను సీజ్ చేసి, ముగ్గురు అనుమానితులు, నలుగురు రౌడీషీటర్లను కస్టడీలోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రజల సహకారం కీలకమన్నారు. కార్యక్రమంలో భువనగిరి ఏసీపీ రాహుల్ రెడ్డి, సీఐ సురేశ్ కుమార్ పాల్గొన్నారు.

రాయగిరి దుర్గామాత ఆలయంలో చోరీ

భువనగిరికలెక్టరేట్, మే 3 : పట్టణ పరిధిలోని రాయగిరి దుర్గామాత ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. అమ్మవారి రెండు జతల బంగారు మంగళసూత్రాలు, మెట్టెలతో పాటు హుండీని ధ్వంసం చేసి రూ.20వేల నగదును ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి నర్ర రమేశ్ గేటు తాళాలు పగిలి ఉండటం చూసి చోరీ జరిగిందని గ్రహించి గ్రామస్తులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆలయం వద్దకు వచ్చి వివరాలు సేకరించారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు పేర్కొన్నారు.

బాలికపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు

కొండమల్లేపల్లి, మే 3 : బాలికపై వ్యక్తి లైంగిక దాడికి యత్నించిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు.. కేసుకొండమల్లేపల్లి పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులోని విద్యుత్ ఉపకేంద్రంలో అనుమల శ్రీను ఆర్టిజన్‌గా పని చేస్తూ వినాయక నగర్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం రాత్రి 7.30 గంటల సమయంలో అదే కాలనీలో నివాసం ఉంటున్న బాలిక(14)పై లైంగిక దాడికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో అక్కడి నుంచి శ్రీను పరారయ్యాడు. ఈ ఘటనపై అమ్మాయి తల్లిదండ్రులు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వివరాలు సేకరించి బాలికపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు దరఖాస్తులు

గుర్రంపోడు, మే 3 : తెలంగాణ మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లకు ఈ నెల 5 నుంచి 20 దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి. రాగిణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : సీఐ ఆదిరెడ్డి

నల్లగొండ సిటీ, మే 3 : ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కనగల్ సీఐ ఆదిరెడ్డి సూచించారు. శనివారం కనగల్ మండలం పర్వతగిరి గ్రామంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజలు మధ్య వర్తుల ప్రమేయం లేకుండా నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి న్యాయం పొందాలన్నారు. వేసవిలో ప్రజలు ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం దొంగతనాలు, సైబర్‌నేరాలు, బాల్య వివాహలు, బాల కార్మిక వ్యవస్థపై కళాకారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ విష్ణుమూర్తి, సిబ్బంది ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఆదిరెడ్డి

ఆర్టీసీ మేనేజర్‌ను గాయపర్చిన వ్యక్తి అరెస్టు

నీలగిరి, మే 3 : నల్లగొండ ఆర్టీసీ మేనేజర్ బోనగిరి నరేందర్ విధులకు అటంకం కల్గించి, కారును తగిలించి గాయపర్చిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఎస్ఐ సైదులు శనివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని బోయవాడకు చెందిన లక్ష్మీమళ్ల వరుణ్‌రాజ్ కొంత కాలంగా తన కియా కారులో నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణికులను చెరవేస్తుంటాడు. ఆర్టీసీ బస్టాండ్‌లో హైదరాబాద్‌కు వెళ్లే ప్లాట్ ఫారం వద్దకు వచ్చి ప్రయాణికులను అద్దెకు మాట్లాడుకుని కారులో ఎక్కించుకుని వెళ్లేవాడు. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి బస్టాండ్‌కు వెళ్లి ప్రయాణికులతో మాట్లాడుతుండగా అక్కడే విధి నిర్వహణలో ఉన్న మేనేజర్ బోనగిరి నరేందర్ కారును తీసుకుని వెళ్లిపోవాలని చెప్పాడు. వరుణ్ రాజ్ వినకపోవడమే కాకుండా మేనేజర్‌పై దౌర్జన్యం చేస్తూ విధులకు ఆటంకం కల్గించినట్లు పోలీసులు తెలిపారు. బస్టాండ్ నుంచి వెళ్లిపోవాలని చెప్పడంతో కారును అతివేగంగా నడుపుతూ బస్టాండ్ నుంచి బయటకు వస్తూ మేనేజర్‌కు తగిలించి గాయపర్చినట్లు పేర్కొన్నారు. సిబ్బంది స్పందించి నరేందర్‌ను వెంటనే ప్రభుత్వ దవాఖానాకు తరలించి చికిత్స అందించారు. బస్టాండ్ అసిస్టెంట్ మేనేజర్ మామిడి హుస్సేన్ ఫిర్యాదు మేరకు వరుణ్‌రాజ్‌పై కేసు నమోదు చేసి కారును సీజ్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

స్వీపర్ కుటుంబానికి అండగా..

స్వీపర్ లక్ష్మయ్య కుటుంబానికి సాయం అందిస్తున్న హెచ్‌ఎం తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి

మోత్కూరు, మే 3: మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వీపర్ ఇట్టబోయిన లక్ష్మయ్య కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. లక్ష్మయ్య కొంత కాలంగా పాఠశాలలో స్వీపర్‌గా పని చేసి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, పూర్వ విద్యార్థుల నుంచి సేకరించిన రూ.63,600 నగదు చెక్కును శనివారం హెచ్‌ఎం తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి.. లక్ష్మయ్య భార్య మంగమ్మకు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటాచారి, రాంప్రసాద్, జయశ్రీ, నిజాం, రవి, వెంకటేశం, పూర్వ విద్యార్థులు గుజ్జ సోమనర్సయ్య, మురళి, బయ్యని రాజు పాల్గొన్నారు.

తెలంగాణ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లకు దరఖాస్తులు

భూదాన్‌పోచంపల్లి, మే 3 : మున్సిపల్ పరిధిలోని తెలంగాణ జూనియర్ కళాశాలలో ఈనెల 5వ తేదీ నుంచి అడ్మిషన్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ ఇంగ్లీశ్ మీడియంలో ప్రతి గ్రూపులో 40 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 20తేదీ లోపు దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుకు ఎలాంటి ఫీజు లేదని తెలిపారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

- ప్రభుత్వ ఉపాధ్యాయుడి ప్రచారం

పట్టణంలోని సుందరయ్య పార్క్‌లో వినూత్నంగా ప్రచారం చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్

మిర్యాలగూడ, మే 3: యువత మాదక ద్రవ్యాల బారిన పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ప్రభుత్వ ఉపాధ్యాయుడు వినూత్న ప్రచారం చేస్తున్నాడు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల జడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రాచకొండ ప్రభాకర్ శనివారం పట్టణంలోని సుందరయ్య పార్క్‌లో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసి యువతకు అవగాహన కల్పించారు. యువత మాదకద్రవ్యాలు, మత్తు బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. జాతరలు, ఉత్సవాలు, వారాంత సంతల్లో రద్దీగా ఉన్న ప్రాంతాల్లో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తుంటానని తెలిపారు. మద్యపానం, ధూమపానం ఆరోగ్యానికి హానికరమని, డ్రగ్స్ వద్దు ప్రాణమే ముద్దు, సేవ్ లైఫ్ అంటూ కరపత్రాలను పంచుతూ మైక్ పట్టుకొని విచిత్ర వేషధారణతో ప్రచారం చేస్తున్నారు.